ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 185 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం 12 అక్టోబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే
## రేవంత్ సంచలన ఆరోపణ

గోవాలో రేవంత్ రెడ్డి పర్యటన

సీఎం ప్రమోద్ సావంత్ లక్ష్యంగా ఆరోపణలు

ఆయన ప్రమోద్ సావంత్ కాదు, ప్రాపర్టీ సావంత్ అని విమర్శ

హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్‌కు మూలం గోవానేనని ఆరోపణ

భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపాటు

గోవాను కాపాడుకోవడానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపు



**హైదరాబాద్, అక్టోబర్ 11 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవాలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోవాను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కాదు, భూములు కబ్జా చేస్తున్న 'ప్రాపర్టీ సావంత్' అని ఆయన పదునైన విమర్శలు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గోయ్ రాఖోన్న్' (సేవ్ గోవా) యాత్రలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పాలనలో గోవా యువత నిరుద్యోగంతో నిరాశకు లోనవుతున్నారని, ప్రమాదకరమైన మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు మూలాలు గోవాలోనే ఉన్నాయి. అక్కడి నుంచే దేశంలోని ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. దిశా డైలీ కథనం ప్రకారం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను కూల్చివేశామని, కానీ గోవా మాత్రం డ్రగ్స్‌కు ప్రధాన కేంద్రంగా మారిందని ఆయన తెలిపారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌పై విమర్శలు కొనసాగిస్తూ, ఆయన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గోవా అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, బీజేపీ ప్రభుత్వం స్థానిక ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు. రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని రేవంత్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును, యువతను కాపాడుకోవాలంటే బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.




## హైదరాబాద్-మియోషి సిస్టర్ సిటీ
# స్నేహ బంధానికి 20 ఏళ్లు

**హైదరాబాద్, అక్టోబర్ 11 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ - మియోషి సిస్టర్ సిటీ స్నేహ బంధానికి 20 ఏళ్లు పూర్తి కావడం ఎంతో ఆనందంగా ఉంది అని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన జపాన్ ఫెస్టివల్--2026లో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి మంత్రి వివేక్ పాల్గొన్నారు. భారత్ జపాన్ మధ్య ఉన్న పరస్పర విశ్వాసం, గౌరవం, సాంకేతిక సహకారం మన సంబంధాలకు బలమైన పునాది అని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ - మియోషి మధ్య ఏర్పడిన ఈ రెండు దశాబ్దాల అనుబంధాన్ని ఇప్పుడు విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సాంకేతికత, పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి రంగాల్లో మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది అని ఆయన అన్నారు. తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందించి, జపాన్‌తో సహ అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే మా లక్ష్యం అని వివేక్ ఉద్ఘాటించారు. జపాన్ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, సాంకేతిక సంస్థలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలు ఏర్పరచి, విద్యార్థులు, యువ నిపుణులకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

గత 20 ఏళ్లలో స్నేహబంధాన్ని నిర్మించుకున్నాం.. రాబోయే 20 ఏళ్లలో కలిసి కొత్త అవకాశాలను సృష్టించుకుందాం అని పిలుపునిచ్చారు. జపాన్ ఫెస్టివల్--2026 కేవలం మన స్నేహానికి ప్రతీకగా మాత్రమే కాకుండా.. సహకారం, ఆవిష్కరణలు, ఉపాధి, ఉమ్మడి అభివృద్ధికి కొత్త అధ్యాయానికి నాంది కావాలని ఆకాంక్షిస్తున్నాను అని మంత్రి వివేక్ పేర్కొన్నారు.

# ఢిల్లీలో భారీ భద్రత
## ఢిల్లీలో సీజేపీ నేతలు అభిజీత్, సౌరవ్, అశుతోశ్ విడుదల

**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 (ప్రభాత ఉదయం)**

ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో ముందస్తు అదుపులోకి తీసుకున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' నేతలు అభిజీత్ దిప్కే, సౌరవ్ దాస్, అశుతోశ్ రంకాలను కోర్టు విడుదల చేసింది. రాబోయే ఒక సంవత్సరం పాటు శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దనే షరతు, రూ.50 వేల పూచికత్తుపై కోర్టు వారిని విడుదల చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండుతో శనివారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టాలనుకోగా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు

..మిగతా 2లో



# రైతన్నలూ! మా మాట వినండి..

యాసంగి పంట వద్దు

నీళ్లు లేవ్.. ఎల్‌నినో ప్రభావం ఎక్కువుంది

పాలేరు నియోజకవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి




**హైదరాబాద్, అక్టోబర్ 11 (ప్రభాత ఉదయం)**

ఎల్‌నినో ప్రభావం వల్ల ఉన్న పంటలనే కాపాడ్డానికి ఇబ్బందులు పడుతున్నా మని.. ప్రభుత్వం మాట విని యాసంగి పంట వేయొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రైతులను కోరారు. రాష్ట్రంలో తీవ్ర జల వనరుల సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. రాష్ట్రానికి అధిక ఆర్థిక సహాయం అందించేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, వీబీజీ రామ్ జీ పథకం కింద గ్రామాల్లో అదనపు పనిదినాలు కల్పించాలని కేంద్రాన్ని కోరతామన్నారు. పాలేరు నియోజకవర్గంలో

..మిగతా 2లో



## రూ. 49కే కిలో
# సన్నబియ్యం

రైతు బజార్లలో కౌంటర్లు

అందుబాటులోకి కేఎన్ ఎం రకం

నేడు ప్రారంభించనున్న మంత్రి నాదెండ్ల

**హైదరాబాద్, అక్టోబర్ 11 (ప్రభాత ఉదయం)**

సామాన్య ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రైతు బజార్లలో కిలో సన్నబియ్యాన్ని రూ.49కే విక్రయించనున్నారు. ఇప్పటికే రైతు బజార్లలో అందుబాటులో ఉన్న బీపీటీ రకం బియ్యంతో పాటు, ఇకపై కేఎన్‌ఎం రకం సన్నబియ్యాన్ని కూడా విక్రయించనున్నారు. ఈ నిర్ణయంతో తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం కొనుగోలు

..మిగతా 2లో

# కారు సీటు కింద రూ.9 కోట్ల గోల్డ్

గుట్టుగా విదేశీ బంగారం రవాణా

అర్ధరాత్రి హైవేపై డీఆర్ ఐ అధికారుల నిఘా

సినీ ఫక్కీలో ఛేజ్ చేసి పట్టివేత

ఇద్దరు నిందితులు అరెస్టు

బంగ్లాదేశ్ నుంచి హైదరాబాద్ కు రాకెట్





**హైదరాబాద్, అక్టోబర్ 11 (ప్రభాత ఉదయం)**

విశాఖలో అర్ధరాత్రి వేళ జాతీయ రహదారిపై సినీ ఫక్కీలో ఛేజ్ చేసి రూ. 8.98 కోట్ల విలువైన అక్రమ బంగారాన్ని రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు సీక్రెట్ గా రవాణా చేస్తున్న 5,832.90 గ్రాముల విదేశీ బంగారాన్ని సీజ్ చేశారు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. కోల్‌కతా మార్గంలో విదేశీ బంగారం అక్రమ రవాణా జరుగుతోందన్న

..మిగతా 2లో

# బాబోయ్.. ఎల్ నినో..!

నిత్యవసర ధరలు భగభగ

రెండు నెలల్లో 5 నుంచి 45 శాతం పెరుగుదల

ఒక్కో కుటుంబంపై కనీసం రూ. 1500 అదనపు భారం

రూ. 2 వేలకు చేరిన బియ్యం బస్తా ధర

ఉల్లి రూ. 80, పెద్ద చిక్కుళ్లు రూ. 100.. అదే దారిలో ఇతర ఉత్పత్తుల రేట్లు

2

## విమానంలో పేలిన
# పవర్ బ్యాంక్

అకస్మాత్తుగా చెలరేగిన మంటలు

చాకచక్యంగా నిలిపివేసిన సిబ్బంది

శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్

ఢిల్లీ - చెన్నై విమానంలో అలజడి

2



# గద్వాల్ జిల్లా ఉద్యోగుల నూతన జేఏసీ కమిటీ ఎన్నిక

### సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తాం: రాష్ట్ర జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి







**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 11(ప్రభాత ఉదయం)**

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల సాధనకై తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గద్వాల జిల్లా కేంద్రంలో "ఉద్యోగులతో ముఖాముఖి" కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉద్యోగుల చైర్మన్ వి. లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వి. రాజశేఖర్, కో-చైర్మన్ కె. హనుమంతరావు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ముఖాముఖి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, బాధ్యులు , ప్రాథమిక సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఉద్యోగుల సమస్యలన్నింటినీ సావధానంగా విన్న రాష్ట్ర చైర్మన్ వి. లచ్చిరెడ్డి మాట్లాడుతూ... "ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలన్నింటినీ వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని" హామీ ఇచ్చారు. ఉద్యమ సాధనకు ఉద్యోగులందరి సహకారం ఎల్లవేళలా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల్ జిల్లా ఉద్యోగ జేఏసి నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకత్వం సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్ గా అజిత్ కుమార్, సెక్రటరీ జనరల్ గా ఐ.శ్రీధర్ రెడ్డిని ఎనుకున్నారు. ఈ సందర రాష్ట్ర చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ... జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరినీ సమన్వయం చేసుకుంటూ, వారి హక్కుల సాధనకు ఉద్యమాన్ని ముందుండి నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా బాధ్యులు , ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

## ఈ నెల 14,15 తేదీల్లో రెగ్యులర్ కోటా

### 16 వ తేదీన ప్రత్యేక కోటా అగ్రికల్చర్ బీ ఎస్సీ సీట్లకి కౌన్సిలింగ్ : రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యాసాగర్.

**బుద్వేల్, అక్టోబరు 11 (ప్రభాత ఉదయం) :**

2026-27 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం లోని రెగ్యులర్ కోటా బీ ఎస్సీ( ఆనర్స్) అగ్రికల్చర్, బీ టెక్( ఫుడ్ టెక్నాలజీ) కోర్సులలో మిగిలిన సీట్లకి మూడవ దశ కౌన్సిలింగ్ ని ఈ నెల 14, 15 వ తేదీలలో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యాసాగర్ ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటన లో వెల్లడించారు. అదే విధంగా ప్రత్యేక కోటా బీ ఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్, బీ టెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల లో మిగిలిన సీట్లకి ఈ నెల 16 వ తేదీ న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ వివరించారు. ఈ రెండు కౌన్సిలింగ్ లు రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియం లో జరగనున్నాయని ఆయన తెలిపారు. సీట్లు, ఫీజులు, కౌన్సిలింగ్ కి తీసుకొని రావాల్సిన ధృవపత్రాలు.. తదితర వివరాలని విశ్వవిద్యాలయం వెబ్ సైట్ www.pjtau.edu.in. లో చూడవలసింది గా తల్లితండ్రులు, విద్యార్థుల కి రిజిస్ట్రార్ జీ ఈ సీ హెచ్ విద్యాసాగర్ సూచించారు.

### రూ. 49కే కిలో

## సన్నబియ్యం

మొదటి పేజీ తరువాయి...

చేయాలనుకునే వినియోగదారులకు ప్రయోజనం కలగనుంది. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరల నేపథ్యంలో రైతు బజార్ల ద్వారా సరసమైన ధరలకు బియ్యం అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. విజయవాడలోని భవానీపురం రైతు బజార్‌లో ఆదివారం ఉదయం 10.30 గంటలకు కేఎన్ఎం రకం సన్నబియ్యం విక్రయాల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి, కిలో రూ.49 చొప్పున బియ్యాన్ని విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బీపీటీతో పాటు కేఎన్ఎం రకం బియ్యం అందుబాటులోకి రావడంతో వినియోగదారులకు మరిన్ని ఎంపికలు లభించనున్నాయి. ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించడమే లక్ష్యంగా పౌరసరఫరాల శాఖ ఈ చర్యలు చేపడుతోంది.

## బాబోయ్.. ఎల్ నినో..!

**హైదరాబాద్, అక్టోబర్ 11 (ప్రభాత ఉదయం)**

దేశంలో ఎల్‌నినో ప్రభావంతో కూరగాయలతో పాటు నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఉల్లిపాయల నుంచి వంట నూనె వరకు వంటిల్లో ఉపయోగించే ప్రతీ వస్తువు ధర పెరుగుతోంది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల నెలవారీ ఇంటి ఖర్చు పెరుగుతోంది. దీనికి తోడు అంతర్జాతీయంగా నెలకొన్న ఘర్షణ వాతావరణంతో సరుకు రవాణాలో అంతరాయం, దేశంలో పెట్రోల్, డీజిల్, ధరలు పెరగడంతో నిత్యావసర సరుకులపై ప్రభావం పడుతోంది. గత రెండు నెలల్లో దేశంలో నిత్యావసర సరుకుల ధరలు 5 నుంచి 45 శాతం వరకు పెరిగాయి. దీని వల్ల ఒక్కో కుటుంబంపై రూ.1500 వరకు అదనపు భారం పడుతోంది. పెరిగిన ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి.

**పెరిగిన బియ్యం ధరలు**

దేశంలో ఎల్‌నినో ప్రభావం వల్ల పంట సాగు నిలిచిపోవడంతో బియ్యం ధరలు పెరిగాయి. 25 కిలోల బస్తా గతంలో రూ.1200కే లభించగా.. ఇప్పుడు రూ.2 వేల వరకు చేరుకున్నాయి. ఇక ఉల్లిపాయల ధరలు కూడా సెంచరీకి చేరువలో ఉన్నాయి. మొన్నటివరకు కిలో ఉల్లిపాయలు రూ.40కే లభించగా.. ఇప్పుడు రూ.80కి చేరుకున్నాయి. ఇక పంచదార ధరలు ఇటీవల పెరగ్గా.. ఇప్పుడు కాస్త అదుపులోకి వచ్చాయి. అలాగే అన్ని కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. పెద్ద చిక్కుళ్లు కిలో రూ.100కి చేరగా.. పచ్చిమిర్చి రూ.50కి చేరుకుంది. ఇక దోసకాయ, పొట్లకాయల ధరలు కూడా పెరిగాయి. అటు మినపప్పు, శనగపప్పు, కందిపప్పు, పెసరపప్పు ధరలు కూడా పెరిగాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడం, గ్రౌండ్ వాటర్ కూడా తగ్గిపోవడంతో రైతుల పంట సాగు చేపట్టడం లేదు. కొన్ని రాష్ట్రాల్లో క్రాప్ హాలీడే ప్రకటించారు. కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయి. కేవలం నదిపరివాహక ప్రాంతాల్లో మాత్రమే నీటి సౌకర్యం ఉండటం వల్ల పంటలు పడుతున్నాయి. రానున్న రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలు మరింత పెరిగే ఛాన్స్ ఉందని తెలుస్తోంది.

**కూరగాయల ధరలు ఇవే..**

పెద్దచిక్కుళ్లు కిలో రూ.100 పలుకుతుండగా.. వంకాయ రూ.49, పచ్చిమిర్చి రూ.55, దోసకాయ రూ.36, క్యాప్సికం రూ.65, టమాటా రూ.33, బీరకాయ రూ.45, దొండకాయ రూ.30, బెండకాయ రూ.22, గోరుచిక్కుడు రూ.35, పొట్లకాయ రూ.23, క్యాబేజీ రూ.29గా ఉన్నాయి.

## రైతన్నలూ! మా మాట వినండి..

మొదటి పేజీ తరువాయి...

ఆదివారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఇప్పటికే రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రెండో పంట వేసి ఇబ్బందులు పడొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. రెండో పంట వేసి, నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి తెచ్చుకోవద్దని, ప్రభుత్వ సూచనలను పాటించాలి. ఎల్‌నినో ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై తీవ్రంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గ బృందం ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తాం. రాష్ట్రానికి అధిక ఆర్థిక సహాయం అందించేలా కృషి చేస్తాం అని పొంగులేటి పేర్కొన్నారు.

### కారు సీటు కింద

## రూ.9 కోట్ల గోల్డ్

మొదటి పేజీ తరువాయి...

స్పష్టమైన ముందస్తు సమాచారంతో డీఆర్ఐ అధికారులు జాతీయ రహదారిపై కాపు కాశారు. అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక కారును గురిపెట్టి.... కొంతదూరం ఛేజ్ చేసి చివరకు అడ్డుకున్నారు. కారులో ఉన్న ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకుని తొలుత ప్రశ్నించగా వారు ఏమీ తెలియనట్లు నటించారు.

**కారు సీటు కింద సీక్రెట్ గా**

కారులో ఉన్నవారి సమాధానాలపై అనుమానం రావడంతో అధికారులు కారును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కారు ముందు భాగంలో ప్యాసింజర్ సీటు కింద కాలి ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా తయారు చేసిన సీక్రెట్ బాక్సులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తెరిచి చూడగా అందులో మూడు ప్యాకెట్లలో ప్యాక్ చేసి ఉన్న 5,832.90 గ్రాముల స్వచ్ఛమైన (24 క్యారెట్ల, 999 ప్యూరిటీ) విదేశీ బంగారం బయటపడింది. బహిరంగ మార్కెట్లో ఈ బంగారం విలువ సుమారు రూ. 8.98 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పట్టుబడిన నిందితులను సమగ్రంగా విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ బంగారాన్ని బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా భారతదేశంలోకి అక్రమంగా ప్రవేశపెట్టారని, అక్కడి నుంచి కోల్‌కతా మీదుగా రోడ్డు మార్గంలో హైదరాబాద్‌లోని వ్యాపారులకు చేరవేసేందుకు తీసుకెళ్తున్నామని నిందితులు అంగీకరించారు. కస్టమ్స్ యాక్ట్ 1962 నిబంధనల ప్రకారం లభించిన విదేశీ బంగారాన్ని, రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఇద్దరు ప్రయాణికులను అరెస్ట్ చేసి.... న్యాయమూర్తి ముందు హాజరుపరచగా కోర్టు వారికి రిమాండ్ విధించింది. ఈ స్మగ్లింగ్ రాకెట్ వెనుక హైదరాబాద్, కోల్‌కతాల్లో ఉన్న ప్రధాన సూత్రధారులు ఎవరనే కోణంలో డీఆర్ఐ అధికారులు విచారణను మరింత వేగవంతం చేశారు.

## విమానంలో పేలిన పవర్ బ్యాంక్

**హైదరాబాద్, అక్టోబర్ 4 (ప్రభాత ఉదయం)**

ఢిల్లీ-చెన్నై వెళ్లే ఇండిగో విమానంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది సమయానికి మంటలను అదుపులోకి తేవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ మేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీ నుంచి చెన్నై ప్రయాణించే ఇండిగో విమానం అక్టోబర్ 11 ఆదివారం మధ్యాహ్నం 1.10 నిమిషాలకు బయలుదేరాల్సి ఉండగా.. 20 నిమిషాల ఆలస్యంతో 1.30 నిమిషాలకు ఢిల్లీ నుంచి బయలుదేరింది. సాయంత్రం 4 గంటల సమయంలో చెన్నై చేరుకోవాల్సిన ఈ విమానంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ నుంచి మంటలు రావడం గమనించిన సిబ్బంది.. అప్రమత్తమై చాకచక్యంగా మంటలను ఆపివేశారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసర ల్యాండింగ్ చేశారు. అనంతరం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన అధికారులు వేరే విమానంలో ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చారు.



## ఢిల్లీలో భారీ భద్రత

మొదటి పేజీ తరువాయి...

వీరిని నిన్న అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఢిల్లీ కంటోన్మెంట్ పోలీసు స్టేషన్ లోని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట పోలీసులు హాజరుపరుచగా వారిని విడుదల చేస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

**రెండో రోజు ఆందోళనలపై పోలీసుల అలర్ట్:**

సీజేపీ అగ్రనేతల విడుదల, ఇవాళ జంతర్ మంతర్ వద్ద నిరసన కొనసాగే అవకాశం ఉండటంతో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా సీజేపీ ఇన్ చార్జి అజింక్య షిండే ఆధ్వర్యంలో నిరసన కొనసాగనున్నట్లు తెలుస్తోంది. నిన్నటి ఆందోళనల్లో రాజకీయ నాయకులు కూడా భాగమయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం సెలవు రోజు కావడంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజధాని అంతటా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 30 వేల మందికి పైగా పోలీసులు పారామిలిటరీ సిబ్బందిని మోహరించారు. ఢిల్లీ సరిహద్దుల వద్ద భద్రతను పటిష్టం చేశారు.




## శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో...జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 11(ప్రభాత ఉదయం):**



జోగులాంబ గద్వాల్ జిల్లా, ధరూర్ మండలం, జాంపల్లి ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన ప్రముఖ ఉపాధ్యాయురాలు పి. రేవతి ఈ సంవత్సరం ప్రతిష్టాత్మక జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడం మన జిల్లాకే కాక యావత్ రాష్ట్రానికి గర్వకారణం. విద్యారంగంలో ఆమె చేసిన విశేష కృషి, అంకితభావం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అందిస్తున్న నిరంతర సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును ఘనంగా అందుకున్నారు. ఈ సందర్భంగా రేవతికి శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ కుటుంబం తరపున హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. భవిష్యత్తులోనూ ఆమె మరిన్నిన్న శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



## పేకాట రాయుళ్లు అరెస్టు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 11(ప్రభాత ఉదయం):**

ధరూర్ మండల కేంద్రంలో రైల్వే ట్రాక్ వద్ద పేకాట స్థావరంపై శనివారం ధరూర్ ఎస్ఐ నందీకర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురి ని అరెస్టు చేశారు. పదకొండు మంది పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ. 25,460, 8 బైక్ లు, పేకాట ముక్కల ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.



## కొండాపురంలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

### ప్రజల ఆరోగ్యమే మన గ్రామ ప్రగతికి పునాది సర్పంచ్ ఎస్. పవన్ కుమార్ రెడ్డి

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 11(ప్రభాత ఉదయం):**

కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామ సర్పంచ్ ఎస్. పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. గ్రామ ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలనే సత్సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి నైరా క్లినిక్ యాజమాన్యాలు, డాక్టర్ గోవింద రెడ్డి నేతృత్వంలో 8 మంది నిపుణులైన వైద్యుల బృందం హాజరయ్యారు. గ్రామస్తులకు బీపీ, షుగర్, జనరల్ మెడిసిన్, ఈసీజీ వంటి పలు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి, తగిన వైద్య సేవలు మరియు ఉచిత మందులు అందించారు. ఈ శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సర్పంచ్ ఎస్. పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... "గ్రామ ప్రజల ఆరోగ్యం మరియు సంక్షేమమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాం" అని తెలిపారు. శిబిరాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన వైద్య బృందానికి, ప్రత్యేకంగా నైరా క్లినిక్ యాజమాన్యానికి , డాక్టర్ గోవింద రెడ్డి కి గ్రామ ప్రజల తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధితో ఎదగాలి: పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

## శివరాంపల్లిలో మిలన్ కేఫ్ ప్రారంభించిన కార్తీక్ రెడ్డి



కేఫ్ ప్రారంభోత్సవంలో బిఆర్ఎస్ నాయకులు



శివరాంపల్లిలో కేఫ్ ప్రారంభించి టీ తాగుతున్న కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్,అక్టోబర్11(ప్రభాత ఉదయం)**

యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధిపై దృష్టి సారించి,సొంతంగా వ్యాపారాలు ప్రారంభిస్తూ ఆర్థికంగా ఎదగాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి సూచించారు.రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి బస్‌స్టాప్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేఫ్ మిలన్ షాపును ఆదివారం ఆయన స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా షాపు నిర్వాహకులను అభినందించి,వ్యాపారంలో మంచి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ప్రస్తుత పరిస్థితుల్లో యువతకు ఆశించిన స్థాయిలో ఉద్యోగావకాశాలు లభించకపోతున్న నేపథ్యంలో స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించడం అవసరమని కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు.తమకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకుని చిన్న వ్యాపారంతో ప్రారంభించి,క్రమంగా దానిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.వ్యాపారంలో పట్టుదల,కృషి,నమ్మకంతో ముందుకు సాగితే ఆర్థికంగా స్థిరపడటంతో పాటు కుటుంబానికి అండగా నిలవవచ్చని తెలిపారు.సొంతంగా ఉపాధి పొందడమే కాకుండా వ్యాపారం విస్తరించిన తర్వాత మరో ముగ్గురు,నలుగురికి లేదా మరింత మందికి ఉద్యోగావకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు.దీంతో నిరుద్యోగ సమస్యను కొంతవరకు అధిగమించడంతో పాటు స్థానికంగా ఇతరులకు కూడా ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.యువత స్వయం ఉపాధి ద్వారా స్థిరపడితే తల్లిదండ్రులకు ఆర్థికంగా చేదోడువాదోడుగా ఉండగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కోలన్ సుభాష్‌రెడ్డి,మాజీ కౌన్సిలర్,కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్,సదాల వెంకట్‌రెడ్డి,ఎర్రోళ్ల యాదయ్య,రఘు యాదవ్,ఎడ్లకాడి సూర్యం తదితరులు పాల్గొన్నారు.



బాల త్రిపుర సుందరీ దేవి అమ్మ వారిని దర్శించుకున్న భక్తులు

### బాల త్రిపుర సుందరీ దేవి

# అమ్మ వారికి పూజలు

**బుద్వేల్, అక్టోబరు 11(ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్ లోని డైరీ ఫారం ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలలో మొదటి రోజు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అమ్మ వారి అవతారం లో దర్శన మిచ్చారు. ప్రధాన అర్చకులు సూరి బాబు పంతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గోల్కొండ గోషామహల్ జిల్లా ఇన్చార్జ్ వై శ్రీధర్, దేవాలయ కమిటీ సభ్యులు నరసింహ, నర్సింగరావు, ఈ వేణుగోపాల్, కే రామకృష్ణ రాజు, బాబు రాజు, సతీష్,ఆంజనేయులు,మల్లేష్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు



మంటలకు తగులబడుతున్న కారు

## చెత్త కాలుస్తుండగా, పార్కు చేసిన కారుకు మంటలు

**బుద్వేల్ ,అక్టోబరు 11 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ తేజస్వీనీ నగర్ కాలనీలో చెత్తను కాల్చడానికి కొం దరు ఆదివారం ఉదయం నిప్పు పెట్టారు. చెత్త తగులబడుతు పక్కనే పార్కు చేసి ఉన్న కారు కు మం టలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బంది కార్యాలయానికి ఫోన్ చేయగా, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే కారు పాక్షికంగా తగులబడిపోయింది. కారు ఎవరిది అనే వివరాలు తెలియాల్సి ఉంది.

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి సమక్షంలో చేరికలు



బిఆర్ఎస్‌లో చేరిన వారితో ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి

**బుద్వేల్,అక్టోబర్ 11 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని బాబుల్‌రెడ్డి నగర్,మోహన్‌రెడ్డి నగర్,శ్రీరామ్‌నగర్ బస్తీలకు చెందిన పలువురు నాయకులు,యువకులు ఆదివారం గులాబీ గూటికి చేరారు.నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి సమక్షంలో,కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో నూతనంగా పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.వివిధ పార్టీలకు చెందిన యువత,కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరడం ద్వారా కాటేదాన్ డివిజన్‌లో పార్టీ కార్యకలాపాలు,స్థానిక రాజకీయ పరిణామాలపై మరోసారి దృష్టి పడింది.బస్తీల వారీగా నాయకులు,యువకులు ఒకే వేదికపైకి వచ్చి పార్టీ కండువాలు కప్పుకోవడం కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

# క్రైస్తవులు యేసయ్య లాంటి మనస్సు కలిగి జీవించాలి

బిషప్ సుదర్శన్ జ్యోతి కొమానపల్లి ని సన్మానిస్తున్న రాజేంద్రనగర్ మన్నా చర్చ్ పాస్టర్ సీ హెచ్ ప్రభావతి. సంఘ సభ్యులు





బైబిల్ సందేశాలను వివరిస్తున్న బిషప్ సుదర్శన్ జ్యోతి కొమానపల్లి

## బిషప్ సుదర్శన్ జ్యోతి కొమానపల్లి

**బుద్వేల్, అక్టోబరు 11 (ప్రభాత ఉదయం) :**

క్రైస్తవులుగా జీవిస్తున్న వారు యేసయ్య మనస్సును కలిగి జీవించాలని మన్నా గ్రూప్ ఆఫ్ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ సుదర్శన్ జ్యోతి కొమానపల్లి సూచించారు. రాజేం ద్రనగర్ మన్నా చర్చి లో ఆదివారం జరిగిన పాస్టర్స్ అప్రిషియేషన్ ఆరాధన కార్యక్రమంలో దైవ సేవకురాలు డాక్టర్ ఆషా కొమానపల్లి తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బైబిల్ సందేశాలను అందజేశారు. యేసు ప్రభువు దేవుని ఆజ్ఞానుసారంగా భూలోకానికి వచ్చాడని, ఆయన తండ్రియైన దేవుని మాటలకు లోబడి జీవించారని గుర్తు చేశారు. ఆ విదంగానే నేడు క్రైస్తవులైన ప్రతి ఒక్కరు దేవుని మనస్సు కలిగి, తగ్గింపు స్వభావంతో లోబడి జీవించే మనస్సును కలిగి ఉండాలన్నారు. రాజేంద్రనగర్ లో దేవుని సేవ చేసిన రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ దేవుని సేవకుల మాటలు విని ఆ విదంగా నడుచుకున్నారన్నారు. ఆయన దేవునిలో నిద్రించారని, రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ స్థానంలో ఆయన సతీమణి సిస్టర్ సీహెచ్ ప్రభావతి సంఘ కాపరిగా కొనసాగుతారన్నారు. వారి కుమారుడు బైబిల్ ట్రైనింగ్ చేసి దేవుని సేవకు వచ్చే వరకు సీహెచ్ ప్రభావతి రాజేంద్రనగర్ లో సేవ చేస్తారన్నారు. మన్నా మినిస్ట్రీస్ కు చెందిన డాక్టర్ ఆషా కొమానపల్లి మాట్లాడుతూ, రాజేంద్రనగర్ లో ఘనమైన దేవుని సేవ చేస్తు దేవునిలో నిద్రించిన రెవరెండ్ సీహెచ్ జాన్మోజెస్ కుటుంబానికి దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడు ఉం టాయని, ఆయన లేకున్నా, ఆయన సతీమణి సిస్టర్ సీహెచ్ ప్రభావతి కి సంఘ సభ్యులందరు సహకరిం చాలని సూచన చేశారు. పాస్టర్స్ అప్రిషియేసన్ ఆదివారం సందర్భంగా రాజేంద్రనగర్ మన్నా సంఘ కాపరి సిస్టర్ సీహెచ్ ప్రభావతి ఆధ్వర్యంలో దైవ సేవకులు బిషప్ సుదర్శన్ జ్యోతి కొమానపల్లి, డాక్టర్ ఆషా కొమానపల్లి లను శాలువ, పూల బోకేతో సన్మానించారు. కార్యక్రమంలో అమలాపురం పాలగుమ్మి లో సేవ చేస్తున్న సిస్టర్ కృపా కుమారి, పాస్టర్ జాన్ వెస్లీ, కిస్మత్ పూర్ రాక్ చర్చి పాస్టర్ రెవరెండ్ జ్యోతి సంపత్, పాస్టర్ పీటర్ తదితరులు పాల్గొన్నారు



## జనసేన పార్టీ వీర మహిళల ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ హెల్త్ క్యాంపు

### ప్రారంభించిన జనసేన నాయకులు ముమ్మరెడి ప్రేమ కుమార్

**కూకట్ పల్లి, అక్టోబర్ 11 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, గాయత్రి నగర్ డివిజన్ వేవేకానంద నగర్ రాయల్ ఓక్స్ స్కూల్ లో జనసేన పార్టీ వీర మహిళల ఆధ్వర్యంలో రివైవ్ మల్టీ స్పెషల్ హాస్పిటల్ వారిచే ఏర్పాటు చేసినటువంటి మెడికల్ క్యాంపు కార్యాలయాన్ని ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్బంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలు, స్థానిక ప్రజలు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. డయాబెటిక్ ఫుట్, వెరికోవెన్స్, రక్తనాళాలు, సాధారణ ప్రసవం, మోకాళ్ళ సమస్య, మెదడు వ్యాధులు, చిన్నపిల్లల డాక్టర్, అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలు సహాయపడతాయని తెలిపారు. ఇటువంటి ప్రజాసేవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వీర మహిళలకు, ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయినింగ్ కమిటీ మెంబర్ ప్రజిత్ గౌడ్, కొల్లా శంకర్, శ్రీనివాస్ గోవిందా, పవన్, వీరబాబు, వీర మహిళలు దుర్గ లక్ష్మి, రత్న వేణి, నాగ వరలక్ష్మి, రాధిక, సింధు, వానిదేవి, శ్రీదేవి, సరోజినీ, నారాయణమ్మ, సుజాత, సత్య, భూలక్ష్మి, సత్యవతి, నాగలక్ష్మి, కుమారి, వీర వేణి, విజయలక్ష్మి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## కనకదుర్గమ్మ, నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారి ఆగమన వేడుకలు

### దసరా ఉత్సవాల్లో పాల్గొన్న పట్వారీ శశిధర్

**కూకట్ పల్లి, అక్టోబర్ 11 (మెట్రో ఉదయం)**

దసరా పండుగను పురస్కరించుకుని శ్రీ కనకదుర్గమ్మ , నల్ల పోచమ్మ దేవాలయంలో దేవీ శరన్నవరాత్రుల ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన అమ్మవారి ఆగమన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.ఆల్విన్ కాలనీ విభాగం ఎల్లమ్మబండ యువ నాయకులు ప్రదీప్ రెడ్డి ఆహ్వానం మేరకు ఉమ్మడి ఆల్విన్ కాలనీ విభాగం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ హాజరై అమ్మవారి ఆగమన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. దసరా శరన్నవరాత్రులు ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నింపాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళలు, భక్తులు , పట్వారీ బృందం పాల్గొన్నారు.




## వివేకానంద నగర్‌లో కార్మికులకు ఘనసన్మానం

### రామకృష్ణ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 50 మంది కార్మికులకు నగదు బహుమతులు

**కూకట్ పల్లి, అక్టోబర్ 11(ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ విభాగం రామకృష్ణ వీధిలో రామకృష్ణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సన్మానం చేసి నగదు బహుమతులు అందజేశారు. సుమారు 50 మంది కార్మికులకు ఈ బహుమతులు అందించారు.సంఘం అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి, కార్యదర్శి రామచంద్ర రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దసరాకు కాలనీలో పనిచేసే కాపలాదారులు, పారిశుద్ధ్య కార్మికులు, వీధి దీపాల కార్మికులు, నీటి సరఫరా, మురుగు కాల్వ, విద్యుత్ కార్మికులందరినీ సన్మానించి నగదు బహుమతులు ఇవ్వడం గత ఐదు సంవత్సరాల నుంచి జరుగుతోందన్నారు.కాలనీ కార్మికుల వల్ల తమ కాలనీకి మంచి పేరు ప్రఖ్యాతులు రావడం గర్వకారణమని, కార్మికులే తమకు బలమని, కాలనీ ప్రజలు తమకు బలగమని అన్నారు. కార్మికులు, కాలనీవాసుల సమక్షంలో 40 సంవత్సరాల నుంచి ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నామని, సహకరిస్తున్న కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చెంగల్ రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీధర్, ప్రసాద్, సూర్యనారాయణ, కిషోర్, నారాయణ సింగ్, కార్మికులు కుమార్, జవాన్, నాగరాజు, విజయ్, చారి, శ్రీనివాస్, యాకయ్య, అనసూయమ్మ, వెంకటమ్మ, ఆటో సురేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 11(ప్రభాత ఉదయం):**

గద్వాల పట్టణంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవీ శరన్నవరాత్రోత్సవాలు పురస్కరించుకొని గద్వాల పట్టణం 2వ వార్డులో శ్రీశ్రీశ్రీ శక్తి స్వరూపిణి దేవాలయంలో మొదటిరోజు అమ్మవారు ముకాంబిక మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారిని ముకాంబిక మాతగా అలంకరించి, పూజలు చేశారు. మహిళలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో, రంగురంగుల విద్యుత్ దీపులతో అలంకరించడంతో ఆలయ ప్రాంగణం భక్తజనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల





సందర్భంగా రోజూ వివిధ అలంకారాల్లో అమ్మవారు దర్శనమిస్తారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని రెండవ వార్డు కౌన్సిలర్ లక్ష్మీ నర్సమ్మ లక్ష్మీకాంతారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కోరారు



## ఎన్టీఆర్ నగర్‌లో గ్యార్వి షరీఫ్ వేడుకలు

**ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ నేత**

**కూకట్ పల్లి, అక్టోబర్ 11 (ప్రభాత ఉదయం)**

ఆల్విన్ కాలనీ విభాగం ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లోని ఈద్గాలో నిర్వహించిన పవిత్ర గ్యార్వి షరీఫ్ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవమని, కుల మతాలకు అతీతంగా అందరూ అన్ని పండుగలు కలిసిమెలసి ఎన్టీఆర్ నగర్ లో నిర్వహించడం మంచి పరిణామమన్నారు. మత సామరస్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖలీమ్, షకీర్, సత్తార్, నవాజ్, రామకృష్ణ, నిజామ్, యాస్మిన్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మూకాంబిక అలంకారంలో శ్రీ శ్రీ శ్రీ శక్తి స్వరూపిణి తాయమ్మ అమ్మవారు దర్శనం

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 11(ప్రభాత ఉదయం):**




గద్వాల పట్టణం రెండో వార్డులో కొలువుదీరిన శ్రీ శ్రీ శ్రీ శక్తి స్వరూపిణి తాయమ్మ దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల మొదటి రోజైన ఆదివారం అమ్మవారు భక్తులకు శ్రీ మూకాంబికా దేవి అలంకారంలో అభయమిస్తూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. మొదటి రోజు వేడుకల్లో భాగంగా తెల్లవారుజామునుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, అర్చనలు వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో, రంగురంగుల విద్యుత్ దీపులతో అలంకరించడంతో ఆలయ ప్రాంగణం భక్తజనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా రోజూ వివిధ అలంకారాల్లో అమ్మవారు దర్శనమిస్తారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని రెండవ వార్డు కౌన్సిలర్ లక్ష్మీ నర్సమ్మ లక్ష్మీకాంతారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



## శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**రాజేంద్రనగర్,అక్టోబర్11(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని భవానికాలనీ (ప్రేమావతిపేట)లో గల శ్రీఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రుల సందర్భంగా ఆలయాలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమ పూజ,లలితా సహస్రనామ పారాయణం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయంలో కొలువుదీరిన బాలత్రిపుర సుందరి అవతారంలో అమ్మవారికి స్థానిక భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఆస్బెస్టాస్ కాలనీలో వైభవంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు పెద్దపీట**

**బతుకమ్మ పోటీల్లో విజేతలకు చీరలు, ప్రశంసాపత్రాల ప్రదానం**

**కూకట్‌పల్లి, అక్టోబర్ 11 (ప్రభాత ఉదయం)**



తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆస్బెస్టాస్ కాలనీలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఆస్బెస్టాస్ కాలనీలోని శ్రీ రేణుక ఎల్లమ్మ--పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో అనుముల స్వప్న కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు మహిళల సందడి, బతుకమ్మ పాటలు, సంప్రదాయాల నడుమ ఉత్సాహభరితంగా సాగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతోపాటు మహిళల్లో ఐక్యతను పెంపొందించి, వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో సామాజిక కార్యకర్త పొన్నాల నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బతుకమ్మ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని, తంగేడు తదితర రంగురంగుల ప్రకృతి పూలతో బతుకమ్మలను అత్యంత అందంగా అలంకరించి తీసుకువచ్చారు. వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలు చూపరులను ఆకట్టుకోగా, పండుగ ప్రాంగణమంతా పూల పరిమళాలు, మహిళల కోలాహలంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆరుగురు విజేతలను ఎంపిక చేసి వారికి చీరలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు తెలంగాణ పండుగల ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాకుండా మహిళల ఐక్యతకు, కుటుంబ అనుబంధాలకు, ప్రకృతితో మనిషికి ఉన్న విడదీయలేని సంబంధానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. స్థానిక దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకలు కాలనీవాసుల్లో ఆనందోత్సాహాలను నింపాయి. సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ సంబరాల్లో పాల్గొన్న మహిళలు తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని చాటిచెప్పారు. ఇటువంటి వేడుకలను ప్రతి సంవత్సరం నిర్వహించడం ద్వారా మన సంప్రదాయాలను కాపాడుకోవడంతోపాటు మహిళలకు ప్రోత్సాహం అందించవచ్చని కార్యక్రమంలో పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేష్‌తోపాటు శివకేశవ గౌడ్, రఫీక్, మహమూద్, విజయ్, గంధం శ్రీనివాస్, వాసాల రమేష్, మురళి, క్రాంతి రాథోడ్, లక్ష్మీ నరసింహ, ఎల్. సిద్దయ్య, పొన్నాల నాగరాజు, మున్నా తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. తెలంగాణ ఆడపడుచుల సంప్రదాయానికి అద్దం పట్టిన ఈ ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు ఆస్బెస్టాస్ కాలనీలో పండుగ శోభను నింపాయి.




## బైక్ దొంగతనం కేసును ఛేదించిన టాస్క్‌ఫోర్స్, లక్ష్మీదేవిపల్లి పోలీసులు

**నిందితుడి అరెస్ట్.. హోండా యూనికార్న్ బైక్ స్వాధీనం**

**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 11, (ప్రభాత ఉదయం)**

**కొత్తగూడెం, అక్టోబర్ 11(ప్రభాత ఉదయం)**

సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మోటార్‌సైకిల్ దొంగతనానికి పాల్పడిన నిందితుడిని టాస్క్‌ఫోర్స్, లక్ష్మీదేవిపల్లి పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి దొంగిలించిన హోండా యూనికార్న్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా పోలీసు శాఖ వెల్లడించింది. లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 174/2026 కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు చేపట్టిన చర్యల్లో జయశంకర్ కాలనీకి చెందిన తాటి బుజ్జిబాబు (33)ను నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణ ప్రకారం.. నిందితుడు గతంలో కాపర్ దొంగతనం, బైక్ దొంగతనం కేసులతో పాటు హత్య కేసులోనూ నిందితుడిగా ఉన్నట్లు వెల్లడైంది. జైలు నుంచి విడుదలైన తర్వాత కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నప్పటికీ, వచ్చిన ఆదాయం కుటుంబ పోషణకు, తన వ్యసనాలకు సరిపోవడం లేదనే కారణంతో దొంగతనానికి పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఆగస్టు 3న లక్ష్మీదేవిపల్లిలోని బావర్చి సెంటర్ సమీపంలో ఉన్న బిల్లా పాన్ షాప్ వద్ద నంబర్ ప్లేట్ లేని హోండా యూనికార్న్ మోటార్‌సైకిల్‌ను గుర్తించాడు. బైక్ యజమానితో పరిచయం పెంచుకుని, అతనికి మద్యం తాగించి, మద్యం మత్తులో ఉన్న సమయంలో బైక్ తాళం తీసుకుని మోటార్‌సైకిల్‌తో అక్కడి నుంచి పరారైనట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం బైక్‌ను విక్రయించి డబ్బు సంపాదించాలని భావించాడు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 10న మోటార్‌సైకిల్‌ను బయటకు తీసుకెళ్తుండగా పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించడం గమనించిన నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన పోలీసులు అతడిని పట్టుకుని విచారించగా, బైక్ దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి, దొంగిలించిన మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలివాహనాలు, ఇతర ఆస్తుల దొంగతనాలకు సంబంధించిన అనుమానాస్పద ఘటనలు కనిపించినా, తమ ఆస్తులు చోరీకి గురైనా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించడంలో సమన్వయంతో పనిచేసిన టాస్క్‌ఫోర్స్, లక్ష్మీదేవిపల్లి పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.





## ధరూర్‌లో పోలీసుల వేధింపులు.. మనస్థాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నం

**- సామాన్యులపై ఎస్సై దౌర్జన్యం, రాజకీయ కక్ష సాధింపులే కారణమంటూ బాధితుడు వీరేష్ ఆవేదన**

**ధరూర్, అక్టోబర్ 11(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల్ జిల్లా ధరూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసుల తీరుపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వీరేష్ అనే యువకుడిపై ధరూర్ ఎస్సై విచక్షణారహితంగా దాడి చేయడంతో పాటు పోలీసుల వేధింపులతో మనస్థాపానికి గురైన ఆయన పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జోగులాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకుంది. అయితే బాధితుడు చికిత్స పొందుతూ తనకు జరిగిన అన్యాయాన్ని వీడియోలో వ్యక్తపరిచాడు. అందుకు సంబందించిన వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. బాధితుడు వీరేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గతంలో జరిగిన గ్రామ సర్పంచ్ ఎన్నికల రాజకీయ కక్షల కారణంగా కొందరు వ్యక్తులు తనపై ఎస్సైతో కలిసి తప్పుడు కేసులు బనాయించారని వీరేష్ వాపోయారు. పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్సై మరియు కానిస్టేబుల్ తనపై భౌతిక దాడికి పాల్పడ్డారని, ఎంతగా బ్రతిమిలాడినా వినకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడి మానసిక క్షోభకు గురిచేశారని తెలిపారు. ఈ అవమానాన్ని భరించలేకనే తాను పురుగుల మందు సేవించి ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్లు బాధితుడి వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీనిపై ధరూర్ ఎస్ఐ నందీకర్ ను వివరణ కోరగా.. ఒక కేసు విషయంలో వీరేష్ ను విచారించినట్లు, ఎలాంటి దాడులు చేయలేదని పేర్కొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608